GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assessments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 09-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారమే ధ్యేయం

**మందమర్రి తెలంగాణ మోడల్ పాఠశాలలో 'సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్' పథకం ప్రారంభం**

**సోమన్‌పల్లిలో ?200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్**

**మందమర్రి: అక్టోబర్ 8 (క్రైమ్ మిర్రర్)**

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం 'సి.ఎం. బ్రేక్ ఫాస్ట్' పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర కార్మిక,మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం మందమర్రి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మండల తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో రాజేశ్వర్‌లతో కలిసి ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు, చదువుపై శ్రద్ధ పెంచేలా ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాలు కలిగిన ఆహారం అందించడం వల్ల వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందన్నారు.

మిగతా 2లో



# లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డ్ కాలనీలో దొంగల బీభత్సం

- మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఉన్నా ఆగని వరుస దొంగతనాలు
- ఇళ్లలో దుకాణాల ముసుగులో ఆకతాయిల ముఠాలు.. పెరిగిపోతున్న గంజాయి సంస్కృతి
- కాలనీ సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసులకు విజ్ఞప్తి

2లో





# ఎన్నికల కమిషన్ తీరుపై కాంగ్రెస్ భారీ ఆందోళన

**లోక్ భవన్ ముట్టడిలో డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి**




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, 'ఇండియా' కూటమి మరియు ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం భారీ సంఖ్యలో జరిగింది. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో కదలివచ్చి తమ నిరసన గళాన్ని వినిపించాయి. ఈ ప్రతిష్టాత్మక నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని, కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఈసీ విఫలమైందంటూ ఆమె ధ్వజమెత్తారు. ఈ నిరసన ప్రదర్శనలో జాతీయ మరియు రాష్ట్ర స్థాయి నాయకులు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, కోఆర్డినేటర్ శ్రీ సచిన్ సావంత్, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుల అడ్డంకులను, ఆంక్షలను సైతం లెక్కచేయకుండా లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని డిసిసి అధ్యక్షురాలు స్పష్టంచేశారు.

# రైతులకు సరిపడా కరెంటు ఇవ్వలేని ప్రభుత్వానికి పాలించే అర్హత ఎక్కడిది?

**మాటల్లో 24 గంటల విద్యుత్.. క్షేత్రస్థాయిలో కోతలేనా?**

**చిలుకూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**చిలుకూరు, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్):** వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. రైతులకు సరిపడా విద్యుత్ అందించలేని ప్రభుత్వానికి పాలించే అర్హత ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు.రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకునేందుకు గురువారం చిలుకూరు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలకు రోజుకు ఎన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా అవుతోంది, ఎక్కడెక్కడ కోతలు విధిస్తున్నారు, సరఫరాలో అంతరాయాలకు కారణాలేమిటనే విషయాలపై విద్యుత్ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందిస్తున్నామని ప్రకటనలు చేస్తోందని, అయితే క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ ఎంతో కీలకమని, సరైన సమయంలో విద్యుత్ అందకపోతే పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారంలోకి రావడానికి 24 గంటల ఉచిత విద్యుత్ అంటూ హామీలు ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మొండి చెయ్యి చూపిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలు ఒకలా.. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరోలా ఉంది" అని ఆయన విమర్శించారు.అధికారిక రికార్డుల్లో నమోదవుతున్న విద్యుత్ సరఫరా గంటలకు, రైతులు వాస్తవంగా పొందుతున్న విద్యుత్‌కు మధ్య వ్యత్యాసం ఉందా లేదా అన్నది అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా సమయాలు, కోతల వివరాలు, లో-వోల్టేజీ సమస్యలు, తరచూ విద్యుత్ నిలిచిపోవడం వంటి అంశాలపై సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని కోరారు.ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, ఈ సమయంలో సాగునీరు అందించేందుకు నిరంతర విద్యుత్ అవసరమని మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. వ్యవసాయ మోటార్లకు సక్రమంగా విద్యుత్ అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు.రైతులకు అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసిన ఆయన.. విద్యుత్ కోతలకు కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం కొనసాగితే రైతుల తరఫున పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతగా ఉండాలని, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించి పంటలకు ఇబ్బంది లేకుండా చూడాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.




# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారమే ధ్యేయం

మందమర్రి మోడల్ స్కూల్ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'గా ఎంపిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రప్పించి మందమర్రిలో ఈ మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయించానని గుర్తుచేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల అలవరచుకుంటే అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని పిలుపునిచ్చారు.

**రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్**

చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని సోమన్‌పల్లి వద్ద 2,500 మంది విద్యార్థులకు వసతి సదుపాయంతో కూడిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మాణ పనులు ?200 కోట్ల వ్యయంతో వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాదిలో దీనిని ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. అలాగే అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాల్లో ఎలాంటి లోపాలు లేకుండా మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందించి దశలవారీగా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య స్కూల్‌లో ఘనంగా 'సేవా సంకల్ప అభియాన్'

**విద్యార్థులకు చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు నిర్వహణ**

**కోదాడ, అక్టోబర్ 08(క్రైమ్ మిర్రర్):** కోదాడ భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా, ఆయన ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సుపరిపాలనను పురస్కరించుకుని నిర్వహిస్తున్న లి'సేవా సంకల్ప అభియాన్'లిలో భాగంగా కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని ఆజాద్‌నగర్ శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. దేశభక్తి, సుపరిపాలన, సేవా భావం వంటి అంశాలపై విద్యార్థులు చిత్రాలు గీసి, ఉపన్యాసాలు అందించారు.కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ప్రవాస్ కన్వీనర్ జిల్లా జనార్ధన్‌రావు, జిల్లా యువ మోర్చా నాయకులు కోదుమూరి ప్రవీణ్, జిల్లా ఎండోమెంట్ కన్వీనర్ బాణాల సాయి శర్మ, బీజేపీ నాయకులు ఏపూరి సత్యరాజు మాదిగ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పిడతల శంకర్, బీజేపీ నాయకులు గుమ్మడవల్లి సోమయ్య, బుర్ర నవీన్, శ్రీచైతన్య స్కూల్ చైర్మన్ కె. అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.





# లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డ్ కాలనీలో దొంగల బీభత్సం

**గండిపేట్, ( క్రైమ్ మిర్రర్):** మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డ్ కాలనీలో దొంగలు తీవ్ర బీభత్సం సృష్టిస్తున్నారు. కొత్తగా నిర్మించుకున్న ఇళ్లు, తాళాలు వేసి ఉన్న నివాసాలను లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి వేళల్లో తలుపులు పగలగొడుతున్నారు. ఇళ్లలో ఉన్న కాపర్ వైరింగ్, విలువైన సామాన్లు, సామగ్రిని యథేచ్ఛగా ఎత్తుకెళ్తున్నారు. మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ అతి చేరువలోనే ఉన్నప్పటికీ ఈ తరహా వరుస నేరాలు జరుగుతుండటం పట్ల స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. భద్రత కరువవ్వడంతో కాలనీవాసులే స్వయంగా అర్ధరాత్రి 12:00 నుంచి 1:00 గంటల వరకు రోడ్లపై కాపలా కాయాల్సి వస్తోందని, ఈ పరిస్థితి తమకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలనీలోని కొందరు వ్యక్తులు తమ ఇళ్లలోనే చిన్నపాటి దుకాణాలు నిర్వహిస్తుండగా, రాత్రివేళల్లో ఆ దుకాణాల వద్దకు ఆకతాయిలు, కుర్రకారు గుంపులుగా చేరుకుంటున్నారు. ప్రాంతంలో గంజాయి విక్రయాలు, వినియోగం విచ్చలవిడిగా సాగుతుండటంతో, ఈ మత్తులో తేలుతున్న యువతే రాత్రివేళల్లో దొంగతనాలకు, అరాచకాలకు తెగబడుతున్నారని కాలనీవాసులు గట్టిగా సందేహిస్తున్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో ఎవరెవరు ఏ క్షణంలో ఎలాంటి నేరాలకు పాల్పడతారో తెలియక కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మైలార్ దేవ్ పల్లి పోలీసులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. కాలనీలోకి వచ్చే, వెళ్లే ప్రధాన రహదారుల వద్ద తక్షణమే ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అపరిచిత వ్యక్తులపై నిరంతరం తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ఇళ్ల ముసుగులో సాగుతున్న అనుమానాస్పద దుకాణాలు, ఆకతాయిల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి గంజాయి దందాను పూర్తిగా అరికట్టాలని, రాత్రివేళల్లో పోలీస్ బీట్, పెట్రోలింగ్ పెంచి కాలనీ ప్రజలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





## అక్రమ అరెస్టులతో మునుగోడులో కాంగ్రెస్ పార్టీ నిరసన

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** కేంద్ర ప్రభుత్వం మరియు సీఈసీ తీరుకు నిరసనగా మునుగోడు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మరియు సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ ఓటు చోరీకి పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పార్లమెంట్లో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి నేతల అక్రమ అరెస్టులు, మరియు వారిపై జరిగిన లాఠీఛార్జ్‌ను తీవ్రంగా ఖండించారు. జిల్లా, మండల నాయకులు, సర్పంచులు, మండల కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చండూరులో కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో...

**చండూరు,క్రైమ్ మిర్రర్:** రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకుల అరెస్టును ఖండిస్తూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఆదేశాలతో చండూరులో కాంగ్రెస్ నాయకులు గురువారం రాస్తారోకో చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ డా.కోడి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు మేకల సాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్‌లు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని, ఎంతకైన పోరాటం చేస్తామని తెలిపారు. కేంద్ర ఎన్నికల అధికారి విఘ్నేశ్ కుమార్‌ను వెంటనే విధుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అర్హులైన వారి ఒక్క ఓటును తొలగించినా ఎంత మాత్రం సహించేది లేదని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ భూతరాజు దశరథ , జిల్లా నాయకుడు కాసాల జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ కోడి సుష్మవెంకన్న, మండల,పట్టణ మహిళా విభాగం అధ్యక్షులు రాధా,పల్లవి, షరీఫ్, మొగుదాల వెంకన్న, కోఆప్షన్ ఖలీలు, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి సంగెపు శ్రీను, నాయకులు పన్నాల లింగయ్య, కారింగు రామ్మూర్తి, నేర్లకంటి రవికుమార్, సుజావుదిన్, కన్నెబోయిన నాగరాజు, సత్యం, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.



# పురాతన ఆలయాలను ఆదరిస్తేనే సనాతన ధర్మం నిలుస్తుంది

- ఆలయాల రక్షణలో ఇబ్బందులు ఎదురైతే ఫోన్ చేయండి.. మీకు అండగా ఉంటాం
- మెదక్, అదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** పురాతన ఆలయాలను ఆదరించి, పరిరక్షిస్తేనే హిందూ సనాతన ధర్మం గొప్పతనం ప్రపంచానికి తెలుస్తుందని, ఆలయాల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ముందుకు రావాలని మెదక్, అదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్సీ అంజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆలయాల రక్షణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహాయం అందిస్తూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ స్టేట్ కన్వీనర్ శ్రీ అన్నవజ్జుల సూర్యప్రకాశ్ రావు, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంగారెడ్డి బీజేపీ కార్యాలయంలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ హిందూ ఆలయాలు, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. భవిష్యత్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ధార్మిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేసే సభ్యులందరికీ వారి అర్హతను బట్టి మంచి అవకాశాలు, పదవులు కల్పించేలా తాను కూడా కృషి చేస్తానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. హిందువులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్టేట్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాశ్ రావు మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని, అప్పుడే హిందూ సమాజంలో చైతన్యం తీసుకురావడం సాధ్యమవుతుందని అన్నారు. శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్ చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

### శంకర్‌పల్లి, చేవెళ్ల ప్రాంతాలకు నియామకాలు

అనంతరం పలువురికి నియామక పత్రాలను అందజేశారు. శంకర్‌పల్లికి చెందిన సీ. జైరాం రెడ్డికి చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్‌గా నియామక పత్రం అందజేశారు. అలాగే వీ. వేణేంద్రాచారికి శంకర్‌పల్లి మున్సిపల్ కన్వీనర్‌గా, పద్మాకర్ చారికి శంకర్‌పల్లి



మండల కన్వీనర్‌గా, సుఖముల చంద్రశేఖర్ రెడ్డికి నవాబ్‌పేట్ మండల కన్వీనర్‌గా, కేదరి చారికి మండల కో-కన్వీనర్‌గా నియామక పత్రాలు అందజేశారు. అదేవిధంగా మెదక్, అదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువురికి కూడా వివిధ బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కార్యవర్గ సభ్యులు వెంకట్రామిరెడ్డి, ఫణిభూషన్, రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్ మణిదీప్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ మల్లేశం, వికారాబాద్ జిల్లా కన్వీనర్ వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా జాయింట్ కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్, రుద్రారం వెంకటేశ్ చారి, జహిరాబాద్ అనితా పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన బాధ్యతలు అందుకున్న వారి కృతజ్ఞతలు

తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక స్టేట్ కన్వీనర్ శ్రీ అన్నవజ్జుల సూర్యప్రకాశ్ రావు, కో-కన్వీనర్ నిరంజన్, అలాగే విజయ్ శ్రీ, నర్సింగ్ రావు, ఆర్. నరేష్ కుమార్ తదితరులకు నూతనంగా నియమితులైన వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ సనాతన ధర్మ పరిరక్షణ, పురాతన ఆలయాల అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల విస్తరణ కోసం తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామని వారు తెలిపారు.

# కాళేశ్వరం త్రివేణి సంగమంలో పిండప్రదానాలు..!!

- మహాలయ పక్షం సందర్భంగా ప్రత్యేక పూజలు
- పుణ్యస్నానాలు ఆచరించి పితృకార్యాలు నిర్వహించిన భక్తులు
- తెల్లవారుజాము నుంచే కాళేశ్వరంలో భక్తుల సందడి

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** గతించిన పెద్దలను స్మరించుకుంటూ వారికి ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ మహాలయ పక్షం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి పవిత్ర పుణ్యక్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ పితృదేవతలకు పిండప్రదానాలు, తర్పణాలు నిర్వహించారు. మహాలయ పక్షానికి హిందూ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ సమయంలో పితృదేవతలను స్మరించుకుని పిండప్రదానం, తర్పణాలు చేయడం ద్వారా వారి ఆత్మకు శాంతి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి కనిపించింది. భక్తులు పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం పురోహితుల ఆధ్వర్యంలో పితృదేవతలకు పిండప్రదానాలు, తర్పణాలు నిర్వహించారు. తమ కుటుంబాల్లో గతించిన తల్లిదండ్రులు, తాతముత్తాతలు, ఇతర పెద్దలను స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. పితృదేవతల ఆశీస్సులతో కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. కాళేశ్వరంలోని త్రివేణి సంగమానికి ఉన్న విశిష్టత కారణంగా మహాలయ పక్షంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. పవిత్ర గోదావరి నదీ తీరంలో పిండప్రదానాలు నిర్వహించడం ద్వారా పితృదేవతలకు పుణ్యఫలాలు చేకూరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. దీంతో మహాలయ పక్షం రోజుల్లో కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాళేశ్వరం త్రివేణి తీర్థ పురోహితులు మాడుగుల పవన్ శర్మ మాట్లాడుతూ.. మహాలయ పక్షం పితృదేవతలను స్మరించుకునే పవిత్రమైన సమయమని తెలిపారు. తమకు జన్మనిచ్చిన పెద్దలను స్మరించుకోవడం, వారి పేరున పిండప్రదానం, తర్పణాలు నిర్వహించడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు నిర్వహించి, పితృదేవతల ఆశీస్సులు పొందాలని సూచించారు. మహాలయ పక్షం సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమానికి వచ్చే భక్తులకు అవసరమైన పూజా కార్యక్రమాలను పురోహితులు నిర్వహిస్తూ, పిండప్రదానాలు, తర్పణాలకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. పుణ్యస్నానాలు, పితృకార్యాలతో కాళేశ్వరం త్రివేణి సంగమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# కాళేశ్వరం పీఎస్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ..!!

- రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు ప్రక్రియపై ఆరా
- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచన
- రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్ వ్యక్తులపై నిరంతరం నిఘా
- రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచన



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ.. విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడిన ఎస్పీ.. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచూగా నమోదయ్యే నేరాలు, గ్రామాల పరిస్థితి, శాంతిభద్రతలు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

**ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి**

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. బాధితులు, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేలా విధులు నిర్వహించాలని సూచించారు.

**రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్ వ్యక్తులపై నిఘా**

పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్‌లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు. వారి కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**సరిహద్దు ప్రాంతం కావడంతో అప్రమత్తంగా ఉండాలి**

కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో పోలీస్ సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఐఐటి హైదరాబాద్ పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు

- భారత్‌లో తయారైన 5జీ రేడియోకు ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్
- ఐఐటీ హైదరాబాద్ పరిశోధనతో వైసిగ్ నెట్‌వర్క్స్ కొత్త ఆవిష్కరణ
- భారత్‌లో తయారైన 32టీ.ఆర్ మాసివ్ మీమో రేడియోతో వైసిగ్ సంచలనం







**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08:** హైదరాబాద్‌కు చెందిన 5జీ డీప్‌టెక్ కమ్యూనికేషన్స్ సంస్థ వైసిగ్ నెట్‌వర్క్స్ భారతదేశంలోనే అభివృద్ధి చేసిన ఓ-రాన్ ప్రమాణాలకు అనుగుణమైన 32టీ.ఆర్ మాసివ్ మీమో యూపీఎల్ఐ రేడియోను వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్--2026లో ఈ సాంకేతికతను ప్రదర్శిస్తోంది. ఐఐటీ హైదరాబాద్, వైసిగ్ నెట్‌వర్క్స్‌లో మాసివ్ మీమో, అప్‌లింక్ రిసీవర్ అల్గారిథమ్‌లపై జరిగిన దీర్ఘకాలిక పరిశోధన ఫలితంగా ఈ రేడియోను అభివృద్ధి చేసినట్లు సంస్థ వెల్లడించింది. 5జీ మిడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌లలో అప్‌లింక్ పనితీరును, ముఖ్యంగా సెల్ ఎడ్జ్ కవరేజీని మెరుగుపరిచేలా దీనిని రూపొందించినట్లు తెలిపింది. యూపీఎల్ఐ సాంకేతికతలో క్లాస్--ఏ, క్లాస్--బీ రెండు విధానాలకు మద్దతు ఉంది. ఎస్‌యూ--మీమో, ఎంయూ--మీమోతో పాటు డౌన్‌లింక్‌లో 16, అప్‌లింక్‌లో 8 స్పేషియల్ లేయర్లకు రేడియో మద్దతు ఇస్తుంది. ఓ-రాన్ అలయన్స్ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ సాంకేతికత మల్టీ--వెండర్ ఓపెన్ రాన్ నెట్‌వర్క్‌లకు ఉపయోగపడుతుందని సంస్థ పేర్కొంది. ప్రస్తుతం భారత్‌తో పాటు విదేశీ ఆపరేటర్లు, భాగస్వాములతో సరఫరా




ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని వైసిగ్ తెలిపింది. 32టీ.ఆర్ మాసివ్ మీమో యూపీఎల్ఐ రేడియోకు వాణిజ్య ఆర్డర్లు స్వీకరిస్తున్నామని, 2027లో భారీ స్థాయి సరఫరాలు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించింది. వైసిగ్ నెట్‌వర్క్స్ వ్యవస్థాపకుడు, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కిరణ్ కూచి మాట్లాడుతూ.. ఐఐటీ హైదరాబాద్, వైసిగ్‌లో ఎన్నో సంవత్సరాలుగా సాగిన పరిశోధనకు ఈ రేడియో ఫలితమన్నారు. పరిశోధనలో సాధించిన సాంకేతికతను క్యారియర్ గ్రేడ్ ఉత్పత్తిగా అభివృద్ధి చేసి ప్రపంచ మార్కెట్‌కు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్--2026లో న్యూఢిల్లీలోని యశోభూమి హాల్--2, బూత్ డి33లో అక్టోబర్ 7 నుంచి 10 వరకు 32టీ.ఆర్ మాసివ్ మీమో యూపీఎల్ఐ రేడియో, 5జీ ఎస్ఏ సొల్యూషన్‌లను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తున్నారు.



# కలెక్టర్, ఎమ్మెల్సీ చేతులమీద ప్రశంసా పత్రం అందుకున్న జక్కలివారిగూడెం సర్పంచ్

**టీబీ ముక్త పంచాయతీ'గా జక్కలివారిగూడెం ఎంపిక**

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలములోని జక్కలివారిగూడెం గ్రామం 2025 సంవత్సరానికి గాను "టీబీ రహిత గ్రామంగా గుర్తింపు పొందింది. జాతీయ ఆరోగ్య మిషన్ మరియు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీబీ ముక్త పంచాయతీ' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ల చేతులమీదుగా గ్రామ సర్పంచ్ జక్కల రేవతి మహేష్ అధికారిక ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గ్రామంలో క్షయ వ్యాధి నివారణకు అధికారులు, ఆరోగ్య సిబ్బంది మరియు గ్రామస్తులు సంయుక్తంగా చేసిన కృషికి ఈ పురస్కారం లభించిందని, రాబోయే రోజుల్లో కూడా ఇదే రకమైన ఆరోగ్యకర వాతావరణాన్ని కొనసాగిస్తూ, గ్రామాన్ని పూర్తిగా టీబీ రహితంగా ఉంచాలని ఈ సందర్భంగా అధికారులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్‌హెచ్ 65 రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

**ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలి**

**సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08:** సంగారెడ్డి చౌరస్తా నుంచి మదీనగూడ వరకు కొనసాగుతున్న ఎన్‌హెచ్ 65 రోడ్డు విస్తరణ పనులను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, సంబంధిత కాంట్రాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో జరుగుతున్న జాప్యానికి కారణాలను తెలుసుకుని, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు, సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిన్నారం డీఎస్పీ ప్రభాకర్, ఇస్నాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





## బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా పాలన జీవితం పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు మాట్లాడుతూ నేడు కార్యకర్తలు చేసిన రక్తదానం వల్ల అనారోగ్యంతో ఉన్న రోగులకు కొంత ఊరటనిచ్చి వారి కుటుంబాలలో వెలుగు నింపుతున్నారని అన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన నరేంద్ర మోదీ గారి జన్మదినాని పురస్కరించుకుని ధర్మపురి నియోజకవర్గంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోదీ గారి పాలనలో దేశం ముందుకు దూసుకుపోతుందని ఆత్మ నిర్భర్ పేరుతో వికసిత భారత్ లక్ష్యంగా మేడ్ ఇండియా మేక్ ఇండియా స్కిల్ ఇండియా లాంటి పథకాల ద్వారా యువతలో మేధావులలో ఉన్న సృజనాత్మక శక్తిని శక్తిని వెలికి తీసి స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందింపజేసి భారత దేశ కీర్తి ప్రతిష్టలను పెంచి ప్రపంచంలోని అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాల సరసన నిలబెట్టే ప్రయత్నంలో 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను నాలుగవ స్థానంలో నిలిపాడని అన్నారు. నరేంద్ర దౌత్య విధానం వల్ల ప్రపంచంలోని ఏదేశ పర్యటనకు వెళ్లిన నరేంద్రమోదీని పెద్దన్నలా చూస్తూ పాదాభి వందనం చేస్తున్నారని. రానున్న రోజుల్లో భారత దేశాన్ని విశ్వ గురువు స్థానంలో నిలబెట్టడానికి నరేంద్ర మోదీ గారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు నిస్వార్థంతో ఎప్పుడూ ప్రజాసేవలో ముందుంటారని రక్తదానం చేసిన కార్యకర్తలను అభినంది బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్రిపెల్లి సత్యమ్ ధర్మపురి పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ జిల్లా సీనియర్ నాయకులు కస్తూరి సత్యం మంచే రాజేష్ అన్ని మండలాల అధ్యక్షులు మరియు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలములోని రావిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డ్ లు గ్రామ సర్పంచ్ వరికుప్పల భువనేశ్వరి విజయ్ కుమార్, జీపీఓ,మరియు పంచాయతీ కార్యదర్శి, వార్డ్ మెంబర్లతో కలిసి పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ అరెస్టుపై నీలం మధు ఆగ్రహం

**ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08:** కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడికి నిదర్శనమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం టీపీసీసీ, ఇండియా బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి నీలం మధు ర్యాలీలో పాల్గొన్నారు. లోక్‌భవన్ వైపు వెళ్తున్న నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించడం ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ బాధ్యత అన్నారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం నేరం కాదని, ప్రజల తరఫున నిలబడటం ప్రతిపక్షాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. అరెస్టులు, కేసులు, బెదిరింపులతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని అన్నారు. రాహుల్ గాంధీ అరెస్టుతో కాంగ్రెస్ వెనక్కి తగ్గదని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, ఓట్ల తొలగింపు అంశంపై కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని నీలం మధు తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఇండియా బ్లాక్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంత సొమ్ము సంతార్పణ...

**గ్రామపంచాయతీకి చేరని టెండర్ సొమ్ము...**

**మూడు కోట్లతో టెండర్ అరకోటిన్నర చెల్లింపు ...**

**నెలకు 30 లక్షలు చెల్లించాలి వాయిదా బకాయి...**

**అయినా కొనసాగుతున్న సంత టెండర్...**



**కొండ మల్లేపల్లి టౌన్ అక్టోబర్ 08 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** నల్లగొండ జిల్లాలోని అతిపెద్ద పశువుల సంత గా పేరు గంచిన కొండమల్లేపల్లి సంత ఏడాదికి గాను మూడు కోట్లకు పైగా టెండర్ ద్వారా దక్కించుకున్నాడు ఓ కాంట్రాక్టర్ సుమారు మూడు కోట్ల పైచిలుకు వేలంపాట ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్ కోటిన్నర మాత్రమే చెల్లించి ప్రతినెల చెల్లించాల్సిన 30 లక్ష రూపాయలు బకాయిలుగా ఉన్నప్పటికీ స్థానిక సర్పంచ్ అధికారులు సొంత కొనసాగింపు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని కొండమల్లేపల్లి ప్రజలు అనుకుంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని వార్డు సభ్యులు సైతం డిపిఓ ద్వారా వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేసినప్పటికీ సరైన స్పష్టమైన సమాధానం లేకపోవడంతో సంత ఎవరికోసం అన్న సందేహాలు వినవస్తున్నాయి. వార్డు సభ్యులు పదేపదే గ్రామ సభలో సైతం పలుమార్లు రసీదులు చూపించమని కోరినప్పటికీ సెక్రటరీ సైతం సంత విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని దీనిపై ఆర్టిఐ ద్వారా సమాచారాన్ని రాబట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఇంత జరుగుతున్న ప్రజాప్రతినిధిగా ఎన్నికైనటువంటి ప్రధమ పౌరుడు సర్పంచ్ సంత విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ఒకవేళ చెల్లించని పక్షాన సంతను ఆపే అధికారం గ్రామపంచాయతీ కౌన్సిల్కు ఉందని దానిని కొనసాగించేందుకు కొంతమంది ద్వారా కాంట్రాక్టర్ తో లాలూచీ పడ్డారన్న సమాచారం

**ఆర్భాటానికి మూడు కోట్ల పైచిలుకు టెండర్**

కొండమల్లేపల్లి సంత టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒకవైపు లాభార్జనలో పొందే ప్రయత్నం చేస్తున్నాడు కానీ నల్లగొండ జిల్లాలోని అత్యధికంగా వేలంపాట ద్వారా దక్కించుకున్న మల్లెపల్లి పశువుల సంత ఆదాయం గ్రామపంచాయతీకి పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఆదాయ వ్యాయాలను ప్రజల అవసరాల కోసం ఖర్చు చేయాల్సినటువంటి ఆదాయానికి గండి పడుతుందని కొండమల్లేపల్లి ప్రజలు అంటున్నారు.

**అత్యధికంగా పన్ను సంత ద్వారానే**

పూర్తిస్థాయిలో చెల్లించని కాంట్రాక్టర్ ను పూర్తిగా రద్దుచేసి మరొక టెండర్ ఇవ్వాల్సిన అవసరం ఉన్నప్పటికీ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఇకనైనా అధికారులు స్పందించి మల్లేపల్లి పశువుల సంత కాంట్రాక్టర్ చెల్లించాల్సిన మొత్తం డబ్బును చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని లేనియెడల మరొక కాంట్రాక్టర్ ద్వారా సంతా వేలం పాట నిర్వహించాలని ప్రజలు అంటున్నారు.

## మృతి చెందిన యువకుని కుటుంబానికి కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సాయం

**కృతజ్ఞతలు తెలిపిన,గ్రామస్తులు కుటుంబసభ్యులు**

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలంలోని జమస్తాన్ పల్లి గ్రామానికి చెందిన జినుకల సైదులు పెద్ద కుమారుడు జినుకల రామకృష్ణ (28) అనే యువకుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,డిసిసిబి ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తక్షణ సాయం కింద 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఇట్టి ఆర్థిక సహాయం గ్రామ సర్పంచ్ అందుగుల నర్సమ్మ యాదయ్య, మాజీ సర్పంచులు పంతంగి స్వామి,ముంత యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ జాజుల స్వామి గౌడ్ లు మృతునీ కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించిన కుంభం శ్రీనివాస్ రెడ్డి కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.





## టీబీ ముక్త పంచాయతీ అవార్డు అందుకున్న సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య

**హర్షం వ్యక్తం చేస్తున్న గుండ్లోరిగూడెం గ్రామస్తులు**

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామ పంచాయతీ అరుదైన ఘనత సాధించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీబీ ముక్త్ పంచాయత్--2025 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గుండ్లోరిగూడెం గ్రామ సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ చేతుల మీదుగా టీబీ రహిత పంచాయతీగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. 2025 సంవత్సరానికి గ్రామానికి ఈ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజల సహకారం, ఆరోగ్యశాఖ సిబ్బంది కృషి, టీబీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఈ విజయానికి దోహదపడ్డాయన్నారు. టీబీ రహిత పంచాయతీగా గుర్తింపు పొందడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. 'టీబీ హారేగా.. దేశ్ జీతేగా' అనే నినాదంతో గ్రామాన్ని ఆరోగ్యవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు..

## ఒగ్గు బీర్ల కళాకారుల కమిటీ ఏర్పాటు..

**నూతన కార్యవర్గానికి పాపిశెట్టిరాము అభినందనలు**

**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి):** కల్వకుర్తి నియోజకవర్గ ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం గురువారం ఆమనగల్లు పట్టణంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు. నియోజకవర్గం అధ్యక్షుడిగా బీర్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా సందం వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కల్వకుర్తి,వెల్దండ మండలాల అధ్యక్షుడిగా వస్పరి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాచూరు యాదయ్య, ఆమనగల్లు,మాడ్గుల మండలాల అధ్యక్షుడిగా పెంద్యాల మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షుడిగా పట్నం రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా పడకల్ శివ పట్నం ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము హాజరై నూతన కార్యవర్గాన్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కళాకారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యుడు శ్రీను నాయక్, బన్నె శివ, వెంకటయ్య, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# మందమర్రి సింగరేణి స్కూల్‌లో పౌష్టిక అల్పాహార బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం

**పిల్లలకు నాణ్యమైన రుచికరమైన బ్రేక్‌ఫాస్ట్ అందించడం చాలా సంతోషకరం: జీఎం ఎన్.రాధాకృష్ణ**

**మందమర్రి టౌన్ అక్టోబర్ 08 క్రైమ్ మిర్రర్:** విద్యార్థుల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'పౌష్టిక అల్పాహార' (బ్రేక్‌ఫాస్ట్) కార్యక్రమాన్ని గురువారం మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ హాజరై విద్యార్థులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపటి పౌరులైన పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం,చదువును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పౌష్టిక అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఉదయాన్నే పోషకాహారం లభించడం వల్ల పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. మన ప్రాంతంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మోడర్న్ కిచెన్ ప్రారంభోత్సవం రోజునే, అక్కడ నుంచి సింగరేణి స్కూల్ పిల్లలకు కూడా అల్పాహారాన్ని అందించాలని కోరామని అన్నారు. పిల్లలకు నాణ్యమైన రుచికరమైన బ్రేక్‌ఫాస్ట్ అందడం చాలా సంతోషంగా ఉంది అని తెలిపారు. రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి ఎన్. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం, ఈ మోడర్న్ కిచెన్ సెంటర్ నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం తమ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్ )కింద రూ.50 కోట్ల భారీ నిధులను 7, 8 మోడర్న్ కిచెన్సెంటర్లకు అందించిందని వారు తెలిపారు. అలాగే మంచిర్యాల్ జిల్లా లోని మోడర్న్ కిచెన్ సెంటర్ కు రూ.7.5 కోట్లు ఇవ్వడం జరిగిందని అంతర్జాతీయ స్థాయి సాంకేతికతతో, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నిపుణులైన ప్రొఫెషనల్ కుక్స్ ద్వారా ఈ ఆహారాన్ని సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సీఎస్ఆర్ నిధుల ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ నిధులను కేటాయించడం ఎంతో తృప్తినిచ్చిందని వారు తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఆరోగ్యంగా ఉంటూ చదువుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ సి.హెచ్. అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.పురుషోత్తం పాఠశాల ఉపాధ్యాయులు,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల సంక్షేమంలో భాగంగా సిఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**మందమర్రి టౌన్ అక్టోబర్ 08 క్రైమ్ మిర్రర్:** ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. చంద్రయ్య, మండల తహసీల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ లతో కలిసి సిఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సిఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు చదువుపై మరింత శ్రద్ధ చూపేలా ప్రోత్సహించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. మందమర్రి మోడల్ స్కూల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక కావడం సంతోషకరమని, తాను ఎం.పి.గా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి మందమర్రిలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయించానని తెలిపారు. విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణతో చదువుకుంటే ఎంచుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని తెలిపారు. విద్యార్థులకు చిన్నతనం నుండి క్రమశిక్షణ అలవాటు చేయాలని, తద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలిచేందుకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో వసతి సదుపాయంతో కూడిన 2 వేల 500 విద్యార్థులకు సోమన్‌పల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాదిలో ఈ పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి, వాటిని దశల వారీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి, ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# మునుగోడులో వైద్య సమీక్ష శిబిరం

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు కంటి చికిత్సలు జరుపుతున్నారు.కంటి శిబిరాలతో పాటు సమీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు.దాంట్లో భాగంగా మునుగోడులో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో గతంలో గుర్తించిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. సమీక్షకు హాజరు కావాల్సిన 43 మంది రోగుల్లో 26 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా, గతంలో శస్త్రచికిత్సకు ఇష్టపడని లేదా వైద్యపరంగా అనర్హులుగా గుర్తించిన వారిలో 51 మంది ఈ కార్యక్రమానికి హాజరు అయినట్లు తెలిపారు. వైద్యుల పరీక్షల అనంతరం 15 మంది రోగులను శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. మరో 10 మంది రోగులు శస్త్రచికిత్సకు అనర్హులు గా గుర్తించారు.అదేవిధంగా 40 మంది రోగులను జనరల్ ఫిజిషియన్ పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా అవసరమైన మందులు మరియు కళ్లద్దాలు అందించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతో పాటు, అవసరమైన వారికి తదుపరి చికిత్స మరియు శస్త్రచికిత్స సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# అంతర్జాతీయ వేదికపై "ముక్కాల ప్రణీత్" ప్రతిభ

**వేద గణితంలో ప్రపంచ స్థాయి టాప్--5లో 'వేదిక్ మైండ్' ప్రాజెక్ట్**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08:** పాఠశాల స్థాయిలోనే వేద గణితంలో ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి గ్రామానికి చెందిన యువకుడు ముక్కాల ప్రణీత్ తాజాగా అంతర్జాతీయ వేదికపై సత్తా చాటారు. హంగేరీలోని బుడాపెస్ట్‌లో నిర్వహించిన 2026 ఐఈఈఈ టెక్నాలజీ సమ్మిట్ ఎథికల్ ఏఐలో ఆయన రూపొందించిన 'వేదిక్ మైండ్' ప్రాజెక్ట్ ప్రపంచ స్థాయి టాప్ 5లో చోటు సంపాదించింది. ఐఈఈఈ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ ఫౌండర్ షోకేస్--ఐడియేషన్ ట్రాక్‌కు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి 115 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎంపికైన 5 అత్యుత్తమ ప్రాజెక్టుల్లో 'వేదిక్ మైండ్'కు స్థానం లభించింది. దీంతో ప్రణీత్ తన ఆలోచనను అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రణీత్ తండ్రి ముక్కాల శంకర్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో వేద గణితంలో జాతీయ అవార్డు సాధించిన ప్రణీత్, ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్యార్థిగా అంతర్జాతీయ ఐఈఈఈ వేదికపై తన ప్రాజెక్ట్‌ను ప్రదర్శించే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ప్రణీత్ సాధించిన ఈ గుర్తింపు హైదరాబాద్ యువతలోని సాంకేతిక ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలకు నిదర్శనమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# సిఎపిడి కిట్లు వెంటనే కొనుగోలు చేయాలి: సిఐటియు

**హెచ్ఓడీ సాంకేతిక నివేదిక ప్రకారమే కిట్లు ఇవ్వాలి**

**డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ఈఎస్ఐ అధికారులు**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08:** కిడ్నీ రోగులకు అత్యవసరంగా అవసరమైన సిఐటియు కిట్ల కొనుగోలులో జాప్యం చేయకుండా వెంటనే సరఫరా చేయాలని సిఐటియు సంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు ఎండీ వాజిద్ అలీ డిమాండ్ చేశారు. టెండర్, జెమ్ పోర్టల్ ప్రక్రియల పేరుతో కాలయాపన చేయకుండా ఆన్--అకౌంట్ బడ్జెట్ ద్వారా 3 నెలలకు సరిపడా కిట్లను తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. సనత్‌నగర్ ఈఎస్ఐ మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డీన్ డాక్టర్ సీతామహాలక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరావును కిడ్నీ రోగులతో కలిసి సీఐటీయూ ప్రతినిధి బృందం కలిసి సమస్యను వివరించింది. ఆగస్టు 28న స్టేట్ మెడికల్ డైరెక్టర్ దాసరి హరిచందన ఆన్--అకౌంట్ బడ్జెట్ ద్వారా 3 నెలలకు సరిపడా కిట్ల కొనుగోలుకు అనుమతులు ఇచ్చినప్పటికీ ప్రక్రియలో జాప్యం ఎందుకు జరుగుతోందని వాజిద్ అలీ ప్రశ్నించారు. సిఐటియు ప్రధాన డిమాండ్లు ఇవే: నెఫ్రాలజీ విభాగాధిపతి ఇచ్చిన టెక్నికల్ జస్టిఫికేషన్ ప్రకారమే సిఎపిడి కిట్లను కొనుగోలు చేయాలి. తక్కువ ధర పేరుతో రోగుల వైద్య అవసరాలకు సరిపోని పరికరాలను కొనుగోలు చేయకూడదు. ఆన్--అకౌంట్ బడ్జెట్‌ను వినియోగించి అత్యవసరంగా 3 నెలల నిల్వకు సరిపడా కిట్లను కొనుగోలు చేయాలి. రోగులకు నిరంతరాయంగా అవసరమైన కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా లేదా రోగుల వైద్య అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కిట్లను కొనుగోలు చేస్తే న్యాయపరమైన పోరాటం చేస్తామని వాజిద్ అలీ హెచ్చరించారు. అవసరమైతే ఆసుపత్రి ఎదుట బాధితులతో కలిసి ఆందోళన చేపడతామని తెలిపారు. రోగుల ఆందోళన, స్టేట్ మెడికల్ డైరెక్టర్ ఆదేశాలు, నెఫ్రాలజీ హెచ్ఓడీ సాంకేతిక నివేదికను పరిగణనలోకి తీసుకున్న డీన్ డాక్టర్ సీతామహాలక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరావు సిఐటియు డిమాండ్లకు సానుకూలంగా స్పందించారు. నెఫ్రాలజీ హెచ్ఓడీ ఇచ్చిన సాంకేతిక నివేదిక ఆధారంగానే కిట్లను కొనుగోలు చేస్తామని, ఆన్--అకౌంట్ బడ్జెట్ ద్వారా అవసరమైన కిట్లను అత్యవసరంగా సమకూర్చి రోగులకు అందిస్తామని హామీ ఇచ్చినట్లు సిఐటియు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ బోర్డు మాజీ సభ్యులు బి.అర్జున్, రామచంద్రాపురం ఈఎస్ఐ నోడల్ సెంటర్ పరిధిలోని కిడ్నీ రోగులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలతో రైతు కన్నీరు.. కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ సమరభేరి!



**చేతికొచ్చిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయ్..**

**రైతులకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి**

**జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్ తీవ్ర ఆగ్రహం**





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** కరెంటు కోతలు, లో-వోల్టేజీ సమస్యలతో చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతుల కష్టాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు ఆందోళన బాట పట్టారు. కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ తో కలిసి ముద్విన్ గ్రామంలో కరెంటు కోతల కారణంగా ఎండిపోయిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

### 24 గంటల కరెంటు హామీ ఏమైంది?: జైపాల్ యాదవ్

ఎన్నికల సమయంలో 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కనీసం 7 గంటల నిరంతర విద్యుత్‌ను కూడా ఇవ్వలేకపోతోందని విమర్శించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందన్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే అసెంబ్లీ వేదికగానైనా, ప్రజాక్షేత్రంలోనైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### రైతుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుంది: దశరథ్ నాయక్

కాంగ్రెస్ పాలనలో రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు మొదలయ్యాయని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ ఆరోపించారు. గిరిజన తండాలు, దళిత, వెనుకబడిన వర్గాల రైతులు లో-వోల్టేజీ సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కరెంటు సమస్యల కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు పూర్తి న్యాయం జరిగే వరకు కల్వకుర్తి గడ్డపై పోరాటం కొనసాగిస్తామని, రైతుల సమస్యలను పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, డైరెక్టర్ వీరయ్య, సర్పంచ్ నీలావతి, లోకేష్ నాయక్, మాజీ సర్పంచులు యాదయ్య, నరసింహ గౌడ్, భాగ్యమ్మ, జంగయ్య, ఉపసర్పంచ్ బాలు నాయక్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, వినోద్, గోపాల్, రాజు, శీను, పర్వతాలు, వెంకటయ్య, జంగయ్య, సైదులు, మహేష్, వెంకటేష్, శీను, సత్తయ్య, హరి, నవీన్, పెంటయ్య, నారయ్య, కృష్ణయ్యతో పాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల్లో జాగ్రత్తలు తప్పనిసరి..!!

- ౦ నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు పాటించాలి
- ౦ ప్రధాన రహదారుల్లో రాకపోకలకు అంతరాయం కలిగించొద్దు
- ౦ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై అప్రమత్తంగా ఉండాలి
- ౦ అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం ఇవ్వాలి



**క్రైమ్ మిర్రర్, మహాదేవపూర్ ప్రతినిధి:** బతుకమ్మ పండుగను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు, యువత, ప్రజలు పోలీస్ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటించాలని మహాదేవపూర్ సీఐ సూచించారు. పండుగ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులు ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, అవసరమైన అనుమతులు, సూచనలు తీసుకోవాలని సీఐ సూచించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లర్లు చేయడం, గొడవలకు పాల్పడటం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించే సమయంలో పోలీసుల సూచనలు, శబ్ద కాలుష్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. బాణసంచా వినియోగించే సందర్భంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ప్రమాదకర రీతిలో బాణసంచా కాల్చకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వాటిని స్వయంగా తాకకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినా, అత్యవసర పరిస్థితి ఏర్పడినా వెంటనే దయల్ 112కు సమాచారం అందించాలని సీఐ సూచించారు. బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా, సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకునేందుకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు.

# బుల్లెట్ ట్రైన్ స్టేషన్, ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదిత స్థల పరిశీలన

ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ స్టేషన్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సబ్‌కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి స్థలాన్ని సందర్శించి, ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమి లభ్యత, స్థల పరిస్థితులు, రహదారి అనుసంధానం, మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. భూ రికార్డులు, సర్వే వివరాలు, స్థల సరిహద్దులను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూ వివరాలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సకాలంలో సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టులకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు, రహదారి అనుసంధానం, ప్రజలకు అవసరమైన ఇతర సదుపాయాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.... అచ్చంపేట నియోజకవర్గంలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్, ఎలివేటెడ్ కారిడార్ వంటి కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు ఏర్పాటు కావడం నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే అచ్చంపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఈ ప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అచ్చంపేట నియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సహకారంతో కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మానసిక అనారోగ్యాన్ని అధిగమించాలి

- 10న వరల్డ్ మెంటల్ హెల్త్ డే
- ప్రముఖ సైకాలజిస్ట్ లక్ష్మీ తాళ్లూరి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మానసిక అనారోగ్యాన్ని అధిగమించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు ప్రముఖ సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్స్ కోచ్ లక్ష్మీ తాళ్లూరి పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈ నెల 10న శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఖమ్మం లోని జెడ్పీ సమావేశం మందిరంలో వరల్డ్ మెంటల్ హెల్త్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లక్ష్మీ తాళ్లూరి మాట్లాడుతూ వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్యక్రమంలో భాగంగా వంద పోస్టర్లతో గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నామని, దీనిని మమత ఆసుపత్రికి చెందిన ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్, డాక్టర్ ఎస్.మంజుల ప్రారంభించనున్నారని తెలిపారు. ఇంకా కార్యక్రమానికి సూపరిండెంటెండ్ ఆఫ్ పోలీస్ రీజనల్ ఇంటిలిజెన్స్ ఆఫీసర్, ఖమ్మం రీజియన్ శ్రీరామోజు రమేష్, ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ సతీష్ బాబు, జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, ప్రముఖ సైకాలజిస్ట్, స్నేహెన్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ టి.సృజన్ కుమార్, పిజి కాలేజీ ప్రిన్సిపాల్, సైకాలజీ యోగాథెరఫి డాక్టర్ టి.గోపి, సైకాలజిస్ట్ ఏ.నాగరాజు, ఎన్‌సిఎస్‌సి కో ఆర్డినేటర్, ఏపిఏఐ ఖమ్మం ప్రెసిడెంట్ ఇ.వెంకటేశ్వర్లు హాజరు కానున్నట్లు తెలిపారు. సమాజంలో ఎన్నో అమానుష, అసాంఘిక సంఘటనలు జరగడానికి కారణం మానసికంగా ఆరోగ్యంగా లేకపోవడమేనన్నారు. విలువలతో కూడిన వ్యక్తులతో కలిసి పని చేయడం వల్ల చాలా విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. విద్యార్థి దశ నుండే వారి మెదళ్లలో చదువుతో పాటు మానసిక పరిపక్వత పెంపొందించడం చాలా అవసరమన్నారు. ఎన్నో రకైమెన మానసిక ఒత్తిళ్లు ఉదాహరణకు స్ట్రెస్, కోపం, ఎన్నో రకాల ఫోబియాలను అధిగమించడం ఈ కార్యకమం ముఖ్య ఉద్దేశమన్నారు. దీన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో కార్యక్రమ కోఆర్డినేటర్ దాసరోజు శ్రీనివాస్, డాక్టర్ పవన్, డాక్టర్ రచన, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# 12 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వకపోతే ఉద్యమం ఉధృతం

కోదాడలో సబ్‌స్టేషన్ ఎదుట టీడీపీ నాయకులు, రైతుల నిరసన

**కోదాడ, అక్టోబర్ 08 (క్రైమ్ మిర్రర్):** కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు విద్యుత్ సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిందని, ప్రస్తుతం 12 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని, సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో విద్యుత్ సమస్యలు మరింత భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు కనీసం 12 గంటల పాటు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు.

# తాగునీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళిక

ఎల్‌నినో ప్రభావంతో సమస్య రాకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 08:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడికి గురయ్యే గ్రామాలు, ఆవాసాలను గుర్తించి ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలన్నారు. బోర్‌వెల్స్, నీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, మోటార్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట కొత్త బోర్‌వెల్స్, ట్యాంకర్లు, అద్దె నీటి వనరుల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సిర్గాపూర్, కంగ్టి, నాగల్‌గిద్ద, రాయికోడ్, వట్‌పల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమస్య ఏర్పడిన తర్వాత స్పందించకుండా ముందస్తు చర్యలతో తాగునీటి ఎద్దడిని నివారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

